రసాభాసగా మండల సర్వసభ్య సమావేశం

- సమావేశాన్ని బహిష్కరించిన ఎంపీటీసీ సభ్యులు
- ఆమోదం లేకుండా మండల పరిషత్ నిధులు ఖర్చు చేయడంపై మండిపాటు



సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించిన ఎంపీటీసీ సభ్యులు

కర్లపాలెం: ఎంపీటీసీ సభ్యుల అనుమతి లేకుండా మండల పరిషత్ నిధులు ఎలా ఖర్చు చేస్తారంటూ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీటీసీ సభ్యులు బహిష్కరించిన సంఘటన శుక్రవారం కర్లపాలెం ఎంపీడీవో కార్యాలయంలో చోటు చేసుకుంది. కర్లపాలెం మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం మధ్యాహ్నం ఎంపీపీ యారం వనజ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో తొలుత మండల స్థాయి అధికారులు అభివృద్ధి కార్యక్రమాల గురించి సభ్యులకు వివరించారు. అనంతరం నల్లమోతువారిపాలెం ఎంపీటీసీ సభ్యుడు తాండ్ర సాంబశివరావు మాట్లాడుతూ కర్లపాలెంలో కొత్తగా తాగునీటి చెరువు కోసం కొనుగోలు చేసిన స్థలంలో నుంచి మట్టి తవ్వి జగనన్న కాలనీలో మెరకపోసి కొందరు వ్యక్తులు తమ జేబులు నింపుకున్నారని ఆరోపించారు. ప్రభుత్వ సొమ్ముతో చెరువు కోసం కొనుగోలు చేసిన స్థలంలో నుంచి పేదల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న జగనన్న కాలనీలో మట్టి పోసి లక్షల రూపాయలు కాజేశారని మండిపడ్డారు. చెరువు మట్టి తీసి కాలనీల్లో పోయటం వలన లబ్ధిదారులు గృహాలు ఎలా నిర్మించుకోవాలని సాంబశివరావు ప్రశ్నించారు.

గత రెండున్నర సంవత్సరాల నుంచి మండల పరిషత్‌లో ఎలాంటి అభివృద్ధి పనులు జరగటం లేదని ఎంపీటీసీలకు అభివృద్ధి పనులు ఇవ్వటం లేదని సాంబశివరావు అధికారులను నిలదీశారు. ప్రస్తుత సమావేశానికి సంబంధించిన అజెండా కాపీలు ఇవ్వాలని డిమాండ్ చేయటంతో మండల పరిషత్ అధికారులు 2023–24 సంవత్సరానికి సంబంధించిన అజెండా ప్రతులు ఇచ్చారు. గత సంవత్సరం అజెండా ప్రతులు ఇవ్వటంపై సాంబశివరావు మండిపడ్డారు. ఎంపీటీసీ సభ్యులకు తెలియకుండా పనులు చేయించి నిధులు డ్రా చేయడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వ సభ్య సమావేశాన్ని బహిష్కరిస్తున్నామని ప్రకటించి ఆయన సమావేశం నుంచి బయటకు వెళ్లిపోగా మరికొంత కొంతమంది ఎంపీటీసీ సభ్యులు ఆతనిని అనుసరించారు.

అనంతరం కొనసాగిన సమావేశంలోఎంపీపీ యారం వనజ మాట్లాడుతూ మండలంలో తాగునీటి అవసరాల కోసం కొన్ని పనులు గుర్తించి ఆమోదించి పనులు చేయించాలని ఎంపీటీసీ సభ్యులకు చెప్పినా వారు చేయించక పోవటంతో కాంట్రాక్టర్లతో చేయించి నిధులు డ్రా చేసి వారికి ఇవ్వటం జరిగిందని వివరించారు.

ఎంపీటీసీలు బాయికాట్ చేసిన విషయమై ఎంపీడీవో కె. నేతాజీని వివరణ కోరగా ఈ రోజు సాధారణ సమావేశం నిర్వహించామని 2024–25 బడ్జెట్‌కు సంబంధించిన సమావేశం కాదని తెలిపారు. గతంలో ఎంపీటీసీ సభ్యులు సర్వసభ్య సమావేశంలో ఆమోదించిన పనులు మాత్రమే చేయించి వాటికి సంబంధించిన నిధులు మాత్రమే డ్రా చేయటం జరిగిందన్నారు. సమావేశాన్ని బహిష్కరించిన వారిలో ఎంపీటీసీ సభ్యులు ఆసిఫ్ అలీ, సామ్రాజ్యం, కమల, పద్మావతి, లక్ష్మణరావు, సుబ్బారెడ్డి ఉన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు పందరబోయిన సుబ్బారావు, కాగిత బుల్లియ్య, కో ఆప్షన్ సభ్యుడు అమీర్ బేగ్, పలువురు సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిత్యావసరాల విక్రయ కేంద్రం ప్రారంభం



నగరం: నాణ్యమైన బియ్యం,కందిపప్పును పేదలకు అనువైన ధరలకు అందించేందుకుగానూ ప్రభుత్వం పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు టీడీపీ నాయకుడు అనగాని శివప్రసాద్ చెప్పారు. మండల కేంద్రమైన నగరంలో శుక్రవారం బియ్యం, కందిపప్పు ప్రత్యేక కౌంటర్‌ను శివప్రసాద్ ప్రారంభించి మాట్లాడారు. ప్రత్యేక కౌంటర్లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తహసీల్దార్ శ్రీశిల్ప మాట్లాడుతూ ఫైన్ రకం స్టీమ్ బియ్యాన్ని కేజీ రూ.49లకు, ఫైన్ రకం ముడి బియ్యాన్ని కేజీ రూ.48లకు, కందిపప్పును కేజీ రూ.160లకు అందించనున్నట్లు తెలిపారు.

అప్రమత్తతతో వ్యాధుల నివారణ

వెదుళ్లపల్లి పీహెచ్‌సీ వైద్యురాలు మానస ప్రియదర్శిని



బాపట్ల: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వెదుళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారిణి మానస ప్రియదర్శిని సూచించారు. శుక్రవారం స్థానిక వైద్యశాలలో ఆమెను కలిసిన విలేకరులతో మాట్లాడారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు ముఖ్యంగా రెండు రకాలుగా ఉంటాయని తెలిపారు. కలుషితమైన నీటి ద్వారా వచ్చే వ్యాధులు, రెండోది దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులని తెలిపారు. కలుషితమైన నీరు, ఆహార పదార్థాలు తీసుకోవటం వలన టైఫాయిడ్, నీళ్ల విరోచనాలు తదితర వ్యాధులు వస్తాయని, దోమల వలన మలేరియా, వైరల్ ఫీవర్, డెంగీ, చికున్‌గున్యా వంటి వ్యాధులు వస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధులను అరికట్టేందుకు అవకాశం ఉందని తెలిపారు. కాచి చల్లార్చిన నీరు తాగడం, వేడి ఆహార పదార్థాలను తినడం, ఆహార పదార్థాలపై ఈగలు, దోమలు వాలకుండా మూతలు ఉంచుకోవాలని డాక్టర్ మానస ప్రియదర్శిని తెలిపారు.

పంచాయతీ సొమ్ము స్వాహాపై డీఎల్‌పీవో విచారణ



పల్లెకోన(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం పల్లెకోన పంచాయతీ సర్పంచ్ బొల్లెద్దు రాజమ్మ రూ.30 లక్షల మేర అవినీతికి పాల్పడినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో బాపట్ల డీఎల్‌పీవో జి.నరసింహారావు శుక్రవారం గ్రామానికి వచ్చారు. పంచాయతీ రికార్డులను నిశితంగా పరిశీలించారు. గతంలో ఇక్కడ పంచాయతీ కార్యదర్శులుగా పని చేసిన ఎస్.రాజశేఖరరెడ్డి, వీవీడీవీ ప్రసాద్‌బాబు, ఎస్‌కే జిలానీ బాషాలను పిలిపించి విచారణ చేపట్టారు. వీరి వెంట ప్రస్తుత ఇన్‌చార్జి సెక్రటరీ కోట శ్రీనివాసరావు ఉన్నారు. ఇంతలో జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి కొల్లూరు వస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు డీఎల్‌పీవో హుటాహుటిన బయలుదేరి వెళ్లారు.

తప్పిపోయిన బాలుడు..



గుంటూరు ఈస్ట్: తల్లిదండ్రుల నుంచి తప్పిపోయి జీజీహెచ్‌లో ఒంటరిగా తిరుగుతున్న బాలుడిని కొత్తపేట పోలీసులు చైల్డ్ వెల్ఫేర్ అధికారులకు బాలుడిని అప్పగించారు. శుక్రవారం తొమ్మిది సంవత్సరాల వయస్సు ఉన్న షేక్ అబ్దుల్ బాసిత్ జీజీహెచ్‌లో ఒంటరిగా తిరుగుతున్నాడు. గమనించిన స్థానికులు బాలుడిని కొత్తపేట పోలీసులకు అప్పగించారు. బాలుడు తల్లిపేరు షరీఫా అని, విజయవాడలోని సుందరయ్యకాలనీలో నివాసం ఉంటున్నట్లు చెబుతున్నాడు. అయితే తండ్రి పేరు చెప్పలేకపోయాడు. ఫొటోలోని బాలుడిని గుర్తించిన వారు 8688831320, 1098కు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఎక్సరే సెంటర్‌లో చోరీ



గుంటూరు ఈస్ట్: ఎక్సరే సెంటర్‌లో చోరీ ఘటనపై కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. కొత్తపేటలోని న్యూ భారతీ ఎక్సరే సెంటర్‌లో గురువారం రాత్రి చోరీ ఘటన చోటుచేసుకుంది. శుక్రవారం ఉదయం ఎక్సరే సెంటర్ నిర్వాహకుడు నాగభూషణం తలుపు తాళాలు పగులగొట్టి ఉండటం గమనించి లోపలకు వెళ్లి పరిశీలించగా రూ.10.30 లక్షలు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. క్లూస్ టీమ్, ఎస్‌హెచ్‌ఓ అన్వర్ బాషా ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోస్టాఫీస్ ఖాతాదారులకు న్యాయం చేయాలి

సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చిక్కాల మణిలాల్



సిరిపూడి పోస్టాఫీస్ వద్ద నిరసన తెలుపుతున్న బాధితులు

నగరం: సిరిపూడి పోస్టాఫీస్‌లో డబ్బులు జమచేసి మోసపోయిన ఖాతాదారులకు ప్రతి రూపాయి తిరిగి చెల్లించాలని సీపీఎం బాపట్ల కమిటీ సభ్యుడు చిక్కాల మణిలాల్ డిమాండ్ చేశారు. సిరిపూడి పోస్టాఫీస్ వద్ద శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో బాధితులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మణిలాల్ మాట్లాడుతూ పోస్టాఫీస్‌లో జరిగిన అవినీతిపై అధికార యంత్రాంగం సరైన పద్ధతిలో స్పందించి బాధితులకు తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గత పదేళ్ల నుంచి ఇక్కడ పని చేస్తున్న ఉద్యోగి సుమారు 700 మంది ఖాతాదారుల డిపాజిట్లు, రోజువారీ పొదుపు మొత్తాన్ని సక్రమంగా డిపాజిట్ చేయకుండా స్వాహా చేసినా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. తక్షణమే బాధితులు డిపాజిట్ చేసిన నగదు, పొదుపు సొమ్మును వారికి తిరిగి అందించాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు రమేష్ పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అవగాహన

బాపట్ల: వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఈఈ ఆంజనేయులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక విద్యుత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈఈ ఆంజనేయులు మాట్లాడారు. తడి చేతులతో విద్యుత్ వస్తువులు, విద్యుత్ పోల్స్‌ని తాకవద్దని, తీగలు తెగిపడితే వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో ఏఈఈ పెరుగు శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

నేటి నుంచి గురుపౌర్ణమి వేడుకలు

భట్టిప్రోలు: భట్టిప్రోలులోని శ్రీ సాయిబాబా మందిర కమిటీ ఆధ్వర్యంలో స్థానిక రథం సెంటర్‌లోని శ్రీ సాయిబాబా ఆలయంలో శ్రీ సాయినాథ–దత్తాత్రేయ స్వామి వార్ల గురుపౌర్ణమి వేడుకలు శనివారం నుంచి ప్రారంభమవుతాయని కమిటీ అధ్యక్షులు తమ్మన రమేష్‌బాబు తెలిపారు. శనివారం భట్టిప్రోలు, అద్దేపల్లి పురవీధులలో శ్రీ సాయినామ ప్రచార కార్యక్రమంలో భాగంగా భిక్షాటన, ఆదివారం స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకం, అష్టోత్తర పూజలు జరుగుతాయని పేర్కొన్నారు. మధ్యాహ్నం గురుపౌర్ణమి సందర్భంగా నారాయణ సేవ నిర్వహించనున్నట్లు తెలిపారు.

పారిశుద్ధ్య పనుల్లో అలసత్వం వద్దు

వేమూరు: అల్ప పీడనం ప్రభావం వల్ల కురుస్తున్న వర్షాలకు పంచాయతీ అధికారులు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని మండల పంచాయతీ విస్తరణాధికారి చొప్పర శేఖర్ ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలంతా కాచి చల్లార్చిన నీరు తాగాలని దండోరా వేయించాలని ఆదేశించారు. డయేరియా ప్రబలుతున్న దృష్ట్యా గ్రామాల్లో ప్రజలకు ఎటువంటి అనారోగ్య లక్షణాలు కనిపించినా వెంటనే వైద్యులను సంప్రదించాలని ప్రజలకు దండోరా ద్వారా అవగాహన పరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శేషగిరిరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రేపు ఇన్విటేషనల్ ఛాంపియన్‌షిప్ ఎంపిక పోటీలు

భట్టిప్రోలు: ఆత్మకూరు తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో ఎంపిక పోటీలు (ఇన్విటేషనల్ ఛాంపియన్‌షిప్–2024) ఆదివారం భట్టిప్రోలు మండలం పల్లెకోనలోని పరుచూరి రఘుబాబు, టి.సుబ్బిరామిరెడ్డి లలిత కళా పరిషత్ కళా ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు ఏబీసీ అండ్ ఎఫ్ తైక్వాండో క్లబ్ (రేపల్లె) కోచ్, నేషనల్ రిఫరీ ఎ.డేవిడ్ శుక్రవారం తెలిపారు. జూనియర్, సీనియర్ విభాగాలలో జిల్లా స్థాయి ఎంపికతో పాటు అన్ని విభాగాల్లో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ పోటీలకు నేషనల్ ప్లేయర్ అండ్ రిఫరీలు ఎ. దిలీప్, ఎ. చైతన్య, ఎస్‌కే అక్బిల్ అహ్మద్, యుటీఎఫ్ నాయకులు కె.సురేష్‌లు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తారని తెలిపారు. ప్రముఖ పారిశ్రామికవేత్త వేములపల్లి రవికిరణ్ ముఖ్య అతిథిగా విచ్చేసి పోటీలను ప్రారంభిస్తారని డేవిడ్ వివరించారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన



భట్టిప్రోలులో రైతులకు సమాచార హక్కు చట్టం కరపత్రాలు అందజేస్తున్న అధికారులు



వేమూరు సదస్సులో మాట్లాడుతున్న సునీత



అమర్తలూరులో చట్టంపై అవగాహన కల్పిస్తున్న నరేంద్ర

భట్టిప్రోలు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ డాక్టర్ చావలి సునీల్ ఆదేశానుసారం శుక్రవారం భట్టిప్రోలులోని ఆర్బీకేలో మండలంలోని రైతులందరికీ సమాచార హక్కు చట్టం -2005పై మండల స్థాయి అవగాహన కార్యక్రమం వ్యవసాయశాఖాధికారి జి.మీరయ్య అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈవో ఎన్. దేవరాజు సమాచార హక్కు చట్టం విధి విధానాలు, చట్టాన్ని ఉపయోగించే తీరుపై అవగాహన కల్పించారు. రిసోర్స్ పర్సన్స్ కె.సురేష్, పి.కిషోర్‌లు రైతులకు చట్టం గూరించి సవివరంగా తెలియజేశారు. అనంతరం రైతులకు సమాచార హక్కు చట్టంకు సంబంధించిన కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారిణి బొర్రా లక్ష్మీరంజిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జేవీ రమణమ్మ, రైతులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టాన్ని వినియోగించుకోండి

వేమూరు: సమాచార హక్కు చట్టాన్ని ప్రజలు సక్రమంగా వినియోగించుకొని వివిధ ప్రభుత్వ కార్యాలయాల ద్వారా సమాచారం పొందవచ్చునని మండల వ్యవసాయాధికారి చందోలు సునీత తెలిపా రు. మండల పరిషత్ కార్యాలయంలో సమాచారం హక్కు చట్టంపై వివిధ శాఖల అధికారులు, రైతులకు శుక్రవారం అవగాహనసదస్సు నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్ర దేశ్ రాష్ట్ర సమాచార కమిషనర్ ఆదేశాల మేరకు స మాచారం హక్కు చట్టంపై అవగాహన సదస్సు ని ర్వహించడం జరిగిందన్నారు. ఈ చట్టం పౌరులందరికీ సమాచారం పొందే హక్కు కల్పించడం జరిగిందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచారం పొందగోరేవారు సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లో పూర్తి సమా చారం ఇవ్వడం జరుగుతుందని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో జొన్నల గడ్డ విజయబాబు, ఎంపీడీవో శేషగిరిరావు, మండల విద్యా శాఖాధికారి ఐ వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహసీల్దారు కనకదుర్గ, పంచాయతీ విస్తరణాధికారి సీహెచ్ శేఖర్, వివిధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

రేపల్లె రూరల్: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయశాఖ అధికారి విజయ్‌బాబు శుక్రవారం తెలిపారు. సదస్సుకు మండలంలోని అధికారులు హాజరు కావాలని కోరారు.

సమాచార హక్కు చట్టంతో మెరుగైన సమాజం

అమర్తలూరు(వేమూరు): సమాచారం హక్కు చట్టం ప్రభుత్వ అధికారులకు జవాబుదారని ఎంపీపీ రాపర్ల నరేంద్ర అన్నారు. అమర్తలూరు మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో సమాచారం హక్కు చట్టంపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో స్వరూపారాణి అధ్యక్షత వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రజలు సమాచార హక్కు చట్టం సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు శివయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిరీక్షణరావు, ఏవో లోకేశ్వరి, ఎంఈవో కె రమేష్, ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చిరుద్యోగులపై వేధింపులు ఆపాలి

సీఐటీయూ డిమాండ్

లక్ష్మీపురం: చిరుద్యోగులపై వేధింపులు తగదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దండా లక్ష్మీనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజి పేర్కొన్నారు. స్థానిక బ్రాడీపేటలోని సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కూటమి గెలుపులో రాష్ట్రంలోని కార్మికులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, స్కీమ్ వర్కర్లు, చిరు ఉద్యోగులకు పాత్ర గణనీయమైందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఉమ్మడి గుంటూరు జిల్లాలో కొంత మంది అంగన్‌వాడీలను 'మీరు రాజీనామాలు చేయమని, అప్పటి వరకు విధుల్లో రావటానికి వీల్లేదని' వేధింపునకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కాంట్రాక్టు ఉద్యోగులకు ఎలాంటి నోటీసు ఇవ్వకుండా నోటి మాటగా ఉద్యోగాల నుంచి తొలగించడం దారుణమన్నారు. యానిమేటర్లను తొలగించేందుకు ప్రభుత్వ అధికారులు స్వయంగా పోలీసులను వెంటబెట్టుకొని గ్రామాలకు వెళ్లి డ్వాక్రా మహిళలతో బలవంతంగా సంతకాలు చేయించి యానిమేట్లను తొలగించినట్లు తీర్మానాలు రాస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలన్నీ చట్టవ్యతిరేకమైనవని, వీటన్నిటిని తక్షణమే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే తొలగించిన ఉద్యోగులందరినీ తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. మానిఫెస్టోలో కార్మికులు, ఉద్యోగులు, చిరుద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చే విధంగా చర్యలు చేపట్టాలని విన్నవించారు. ఈ విషయాలపై జిల్లాలోని ప్రజాప్రతినిధులు అందరికీ సీఐటీయూ ఆధ్వర్యంలో విజ్ఞాపన పత్రాలు అందించనున్నట్లు తెలిపారు. తమ ఉద్యోగాలు, హక్కులు నిలబెట్టుకునేందుకు ఆయా సంఘాల ఆధ్వర్యంలో చిరుద్యోగులు చేసే పోరాటాలకు సీఐటీయూ ప్రత్యక్షంగా మద్దతు ఇస్తుందన్నారు.

ఉపాధ్యాయులపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: పెదకాకాని మండలం యాదవపాలెం ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న నలుగురు ఉపాధ్యాయులపై విధించిన సస్పెన్షన్ ఎత్తివేయాలని ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బసవలింగారావు, మహమ్మద్ ఖాలీద్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. అల్పాహారం చేసేందుకు ఇంటికి వెళ్లొస్తానని ప్రధానోపాధ్యాయుడి వద్ద అనుమతి తీసుకునేందుకు వెళ్లిన ఐదో తరగతి విద్యార్థినికి అనుమతి నిరాకరించినప్పటికీ, తరగతి గదికి వెళ్లినట్లే వెళ్లిన సదరు విద్యార్థిని ఉపాధ్యాయులకు చెప్పకుండా పాఠశాల నుంచి బయటకు వెళ్లిందని తెలిపారు. పాఠశాల ప్రహరీ దూకి బయటకు వెళ్లిన విద్యార్థిని తలకు గాయం కావడం దురదృష్టకరమన్నారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఉపాధ్యాయులు పని చేస్తుండగా, అనుకోని ఘటన తీవ్ర మనోవేదనకు గురిచేసిందన్నారు. జరిగిన ఘటనలో ప్రత్యక్షంగా ప్రమేయం లేకున్నప్పటికీ మొత్తం నలుగురు ఉపాధ్యాయులను బాధ్యులని చేసి సస్పెండ్ చేయడంతో ఆత్మస్థైర్యం దెబ్బతిని, నిబ్బరం కోల్పోయారన్నారని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారి ఉపాధ్యాయులపై సానుభూతితో వ్యవహరించి, సస్పెన్షన్ ఎత్తివేయాలని కోరారు.

21న పిట్టలవానిపాలెంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

హాజరు కానున్న ప్రముఖులు



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న నాయకులు

బాపట్ల: పిట్టలవానిపాలెంలో జరిగే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు అంతా తరలి రావాలని బహుజన కెరటాలు వ్యవస్థాపకుడు పల్నాటి శ్రీరాములు కోరారు. దక్షిణాంధ్రప్రదేశ్‌లోనే మొట్ట మొదటిసారిగా సింహాసనంపై కూర్చున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని జులై 21 ఆదివారం పిట్టలవానిపాలెంలో బాబాసాబ్ అంబేడ్కర్ మనుమడు ఆనంద్ రాజ్ యశ్వంత్ అంబేడ్కర్ ఆవిష్కరిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, బాపట్ల శాసన సభ్యులు వేగేశ్న నరేంద్ర వర్మ, బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొంటారని తెలిపారు.ఆహ్వాన పత్రికల ఆవిష్కరణలో నాయకులు కాగిత కోటేశ్వరరావు, గుదే రాజారావు, దేవరకొండ రాము, తమలపాకుల భాస్కరరావు, సలగల చంటిబాబు, రవిరాజు, ఎస్ఎం రాజు, నల్లమోతు శామ్యూల్ జాన్సన్, దయాబాబు, ఎలీషమ్మ, అరుణ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



మోళ్లగుంట గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

రేపల్లె రూరల్: ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందేందుకు అవకాశం ఉందని, వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మోళ్లగుంట పీహెచ్‌సీ వైద్యాధికారి సాయి అన్నారు. డెంగీ మాసోత్సవాల్లో భాగంగా మోళ్లగుంట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గ్రామంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. డెంగీ, మలేరియా, చికిన్‌గున్యా, బోదవ్యాధి, మెదడువాపు వ్యాధులు వ్యాపించేందుకు అవకాశం ఉందన్నారు. కలుషిత నీటి ద్వారా నీళ్ల విరోచనాలు, టైఫాయిడ్, కామెర్లు, కలరా, పోలియో తదితర వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. అనారోగ్య సూచనలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించి చికిత్స పొందాలని చెప్పారు. దోమల నిర్మూలనతో వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. గృహాల పరిసర ప్రాంతాలలో తేమ వాతావరణం, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. కాచి చల్లార్చిన పరిశుభ్రమైన తాగునీటిని మాత్రమే తాగాలని చెప్పారు. ఆహార పదార్థాలపై తప్పనిసరిగా మూతలు ఉంచాలన్నారు. అనంతరం పురవీధుల్లో వ్యాధులపట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నినాదాలు చేస్తూ ఆరోగ్య సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రావణ్య, సూపర్‌వైజర్‌లు వైవి రావు, రంగారావు, ప్రేమకుమారి, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టం వజ్రాయుధం లాంటిది



సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

పిట్టలవానిపాలెం: సమాచార హక్కు చట్టంపై అధికారులు, ప్రజలు అవగాహన కలిగి ఉండాలని రిసోర్స్ పర్సన్ ఇమ్మానుయేల్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సమాచార హక్కు చట్టం-2005 పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ప్రజలకు వజ్రాయుధం లాంటిదన్నారు. ప్రజలకు రాజ్యాంగం ప్రాథమిక హక్కులు కల్పించిన మాదిరి గానే సమాచార హక్కు చట్టాన్ని కూడా రూపొందించినట్లు తెలిపారు. ప్రభుత్వ పాలన పారదర్శకంగా ఉండాలనే లక్ష్యంతో 2005లో సమాచార హక్కు చట్టం రూపు దిద్దుకుందని వివరించారు. సమాచారం కోరుతూ అర్జీలు ఏవిధంగా పెట్టాలి..ఎన్ని రోజుల్లో సమాచారం ఇవ్వాలి అనే విషయాలను గురించి వివరించారు. కార్యక్రమంలో ఏడిఏ లక్ష్మి, బాపట్ల ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త రాధాకృష్ణ, మండల వ్యవసాయాధికారి సత్యానంద్, మండల స్థాయి అధికారులు, పలు గ్రామాల సర్పంచ్‌లు, పలు పార్టీల నాయకులు ఉన్నారు.

అధికారుల తీరుపై మండిపాటు

సమాచార హక్కు చట్టంపై అవగాహనా కార్యక్రమానికి సంబంధించిన సభావేదికపై టీడీపీ నాయకులను కూర్చోబెట్టడంతో వైఎస్సార్ సీపీ నాయకులు దేగల రవిరెడ్డి అధికారులను ప్రశ్నించారు. టీడీపీ నాయకులకు, ఈ కార్యక్రమానికి సంబంధం ఏమిటని ప్రశ్నించారు. అధికారులు తమ మనుగడ కోసం టీడీపీ నాయకులను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారని దేగల రవిరెడ్డి ఆరోపించారు.

ఎన్ఎంఎంఎస్‌కు ఐదుగురు విద్యార్థులు ఎంపిక



మోర్ల తేజశ్రీ



పమిడిపాముల గౌతమ్



సుబ్రహ్మణేశ్వర శ్రీనివాస్



అందె సాయిసూర్య



మాచర్ల గాయత్రి

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలంలో నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)కు ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. పెసర్లంక, పల్లెకోన, ఐలవరం జెడ్పీ హైస్కూల్స్ నుంచి మోర్ల తేజశ్రీ,, పమిడిపాముల గౌతమ్, దామర్ల సుబ్రహ్మణేశ్వర శ్రీనివాస్, అందె సాయిసూర్య, మాచర్ల గాయత్రిలు ఎంపికై నట్లు ప్రధానోపాధ్యాయులు ఎస్‌కే మహబూబ్‌బాషా, ఈగా మునియ్య, మాచర్ల మోహన్‌రావులు శుక్రవారం తెలిపారు. వీరిని ఎంఈవోలు పి.లాజర్, ఎన్. దేవరాజులు అభినందించారు.

బ్యాంకులన్నీ ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి

ఘనంగా బ్యాంకుల జాతీయకరణ దినోత్సవం



ఏఐబీఈఏ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతున్న కిషోర్‌కుమార్, రామారావు, సయ్యద్ బాషా తదితరులు

కొరిటెపాడు(గుంటూరు): బ్యాంకుల జాతీయకరణ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. హిందూ కళాశాల యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ వద్ద ఏఐబీఈఏ పతాకాన్ని ఇండియన్ బ్యాంక్ ఉద్యోగ సంఘ నాయకుడు రామారావు ఆవిష్కరించారు. జిల్లా బ్యాంక్ ఉద్యోగుల సమన్వయ సంఘం సలహాదారు పి.కిషోర్‌కుమార్ మాట్లాడుతూ 1969 జులై 19న నాటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ 14 బ్యాంకులను జాతీయం చేసినట్లు చెప్పారు. భా రత దేశ చరిత్రలో ఇదొక ప్రధాన ఘట్టమన్నారు. బ్యాంకింగ్ సౌకర్యాలు పట్టణాల నుంచి గ్రామీణ ప్రాంతాలకు విస్తరించిందని చెప్పారు. కానీ 1991 తర్వాత వచ్చిన ప్రభుత్వాలు ఆర్థిక సంస్కరణల పేరుతో ప్రభుత్వ రంగ బ్యాంకులను నిర్వీర్యంచేస్తూ ప్రైవేటుబ్యాంక్‌లను సమర్థిస్తోందని ఆరోపించారు. ఇప్పటికే ప్రభుత్వ రంగ బ్యాంకులలో రాజకీయ జోక్యంతో నిరర్థక ఆస్తులు విపరీతంగా పెరగడం ఈ పది సంవత్సరాలలో రూ.లక్షల కోట్లు మాఫీ చేయడం జరిగిందని తెలిపారు. ప్రజలు వ్యవసాయ రుణాల మాఫీ అడుగుతుంటే కార్పొరేట్ రుణాల మాఫీ ప్రభుత్వం చేపడుతోందని విమర్శించారు. ఈ రోజు భారతదేశంలోని బ్యాంకులలో ఉన్న రూ.225 లక్షల కోట్లు ప్రజాధనం సురక్షితంగా ఉండాలంటే బ్యాంకులన్నీ ప్రభుత్వ రంగంలోనే కొనసాగాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. రుణ ఎగవేతదారులైన బడా పెట్టుబడీ వర్గాల మీద క్రిమినల్ కేసులు పెట్టి వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బ్యాంకులలో వెంటనే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని కోరారు. సామాన్యులు పొదుపు చేసుకొనే సేవింగ్స్ బ్యాంకు అకౌంట్స్‌కు ఇచ్చే వడ్డీ రేట్లు పెంచాలన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వం తీసుకొనే ప్రజా వ్యతిరేక నిర్ణయాలను వ్యతిరేకిస్తూ ఏఐబీఈఏ ద్వారా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బాషా, యూనియన్ నాయకులు మురళీ, రవీంద్రారెడ్డి, శివాజీ, షరీఫ్, క్రాంతి, పావని, పృథ్వీ, రామకృష్ణ, కుమార్ పాల్గొన్నారు.